క్లుప్తంగా

ఘనంగా కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ



బలభద్రపురంలో ప్రతిష్ఠించిన కోదండరాముని విగ్రహం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో వెలంపేట వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ మిక్కిలి దుర్గయ్యశాస్త్రి, మహంకాళి వెంకటరమాశాస్త్రిల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి



వర్మీ కంపోస్టుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రాజానగరం: సేంద్రియ ఎరువులతో పంటలను పండించడం ద్వారా మానవాళి జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చని గైట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అన్నారు. ఎన్ఎస్ఎస్ సేవ కార్యక్రమంలో భాగంగా వెలుగుబంధలో బుధవారం 'కిసాన్ దివాస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలాలలో లభించే ఎండిపోయిన పేడ నుంచి లభించే వర్మీ కంపోస్టు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్యవంతమైన పంటలు పండించడానికి, మంచి దిగుబడులు సాధించడానికి వీలుంటుందని పొలాలకు వెళ్లి రైతులకు అవగాహన కలిగించారు. యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ ఖర్చులను కూడా తగ్గించవచ్చన్నారు.

అన్నపూర్ణయ్య సేవలు చిరస్మరణీయం



నరసింహారెడ్డిని సత్కరిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: దేశ స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ కాలం జైలు జీవితం గడిపి, తన జీవితాన్ని ప్రజల కోసం అర్పించిన మద్దూరి అన్నపూర్ణయ్య చిరస్మరణీయుడని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. మద్దూరి అన్నపూర్ణయ్య 125వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక జెండా పంజా రోడ్డులోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సభలో 2024 సంవత్సరానికి మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక అవార్డులను డీఎంహెచ్ హైస్కూల్ విశ్రాంత హెడ్‌మాస్టర్ ఆర్‌వీ చలపతి, ఆధ్యాత్మిక, సామాజిక సేవవేత్త అంబటి భీమాశంకర నారాయణ, కార్మిక నాయకుడు కెల్.నరసింహారెడ్డి తదితరులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, టీకే విశ్వేశ్వరరెడ్డి, అశోక్‌కుమార్‌జైన్, షేక్ అసదుల్లా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దు

- చేసిన అభివృద్ధిని చూడండి
- పొందిన సంక్షేమాన్ని మరువకండి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సీతారామపురం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన జక్కంపూడి రాజా దంపతులు

రాజానగరం: అధికారం కోసం ప్రతిపక్షాలు తమ పాలనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని, వారి మాటలను నమ్మవద్దని, వాస్తవాలను గ్రహించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులను చూసి, పొందిన సంక్షేమ పథకాలను మరుకుండా రాబోయే ఎన్నికల్లో మరొకసారి వైఎస్సార్ సీపీ అవకాశం ఇవ్వాలని కోరారు. మే 13న జరుగబోయే ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో రాజానగరం మండలం, సీతారామపురం నుంచి ఎన్నికల ప్రచారాన్ని తన సతీమణి డాక్టర్ రాజశ్రీతో కలసి బుధవారం ప్రారంభించారు. తొలుత ఆ గ్రామంలోని రామాలయంలో జక్కంపూడి రాజా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. డాక్టర్ రాజశ్రీ మహిళలకు బొట్టు పెట్టి, రాబోయే ఎన్నికలలో 'ఫ్యాను' గుర్తుకు ఓటు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.1158 కోట్ల మేరకు అభివృద్ధి పనులు చేపడితే, మరో రూ.1142 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించామన్నారు. వీటిలో సీతారామపురంలో రూ.11 కోట్ల మేరకు అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా చేసేలా అందుకు అవసరమైన ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మించామన్నారు. ఎన్నికల సమయం రాగానే ప్రతిపక్షాలకు ప్రజలు గుర్తుకు వస్తారని, గుండెల్లో కత్తులు పెట్టుకుని, పైకి ఒకరికొకరు పొత్తు పొట్టుకుంటూ తమకు ఓటు వేస్తే అది చేస్తాం, ఇది చేస్తామంటూ మాయ మాటలు చెప్పే ప్రయత్నిస్తారన్నారు. ఏది నిజమో, ఏది అబద్ధమో గ్రహించి తీర్పునివ్వాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, సీతారామపురం సర్పంచ్ బొబ్బరాడ వరహాలు, ఉపసర్పంచ్ గొల్లబ్బాయి, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వేమగిరి కృష్ణ, అడబాల చినబాబు, అడబాల వీర్రాజు, పలివెల గోవిందు, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాను అరికట్టాలి



మనుషుల అక్రమ రవాణాకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శిస్తున్న సభ్యులు

రాజానగరం: మనుషుల అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని, దీనిని సకాలంలో సరైన రీతిలో అరికట్టకపోతే ఉన్మాదంగా పెరిగిపోతుందని మండల విద్యాశాఖాధికారి రామన్నదొర ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కి చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాను అరికట్టడంపై స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు బుధవారం ఒక రోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా రామన్నదొర మాట్లాడుతూ ముఖ్యంగా అమ్మాయిలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. స్నేహాలు, ప్రేమలు పేరుతో మోసాగాళ్ల మాయలోపడి జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ఆన్‌లైన్ పరిచాయాలతో పేరుతో మహిళలను ట్రాప్ చేస్తున్నారని, మహిళలు తమను తాము రక్షించుకునే స్థాయిలో ఉండాలన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.బలరామకృష్ణ, పద్మశ్రీ డాక్టర్ సునీతకృష్ణన్ మాట్లాడుతూ మహిళ శిశు సంక్షేమ శాఖ, పోలీసు, విద్యా శాఖ, న్యాయ శాఖల సహకారంతో ఇంత వరకు 28,200 మంది అమ్మాయిలను అక్రమ రవాణా నుంచి కాపాడి, పునరావాసం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు ఏపీఎం హేమనాగలక్ష్మి, ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్యశృతికుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ శివ, సుప్రియ, సీసీలు రాజయ్యదొర, లవకుమారి, జి. నాగరాజు, ఎస్. పద్మారావు, పి.కన్నబాబు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలన చూసి ఓటేయండి



చింతపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

- చింతపల్లిలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి ప్రచారం

పెదపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనను చూసి వైఎస్సార్ సీపీకి ఓటేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని చింతపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు గడప గడపలో మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. రోజురోజుకూ ముఖ్యమంత్రి జగన్‌కు ఆదరణ పెరుగుతుందన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, నాడు–నేడు, రైతు భరోసా, చేయూత, ఆసరా తదితర సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. మే 13న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన భర్త సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, ఎంపీగా గూడురి శ్రీనివాస్‌ను, సీఎంగా జగనన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ కొల్లు లోవకుమారి, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, పి.చంద్రకళ, మేడపాటి విజయ, కొల్లు సత్తిబాబు, సీహెచ్ వీరబాబు, పాలిక నూకరాజు, పెంకే గణేష్, జామి దుర్గబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సాంబత్తుల చంటి తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి



ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థినులు

అనపర్తి: నోటి శుభ్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏరియా ఆసుపత్రి వైద్యులు స్థానిక జీబీఆర్ నర్సింగ్ విద్యార్థినులతో కలిసి నోటి శుభ్రతపై అవగాహన ర్యాలీని నిర్వహించడంతో పాటు ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ పొగాకు వాడకం, మత్తు పదార్థాలను సేవించడాన్ని మానుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆహారం తిన్న వెంటనే నోరు శుభ్రం చేసుకోవాలని, తీపి పదార్థాల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్, డాక్టర్ కోటేశ్వరి, డాక్టర్ సునీల్, డాక్టర్ డేవిడ్, డాక్టర్ చారి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యేసు రాణి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. నోటి పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేశారు. యేసురాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నోటి ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రెండు పూటలు పళ్లను శుభ్రం చేసుకోవాలని అన్నారు. బాగా వేడి, బాగా చల్లని పదార్థాలు తీసుకోకూడదన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.వెంకటరత్నం, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, స్టాఫ్‌నర్స్ రేవతీదేవి, సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్ స్వరూపారాణి, ఎల్‌టి శిల్ప, సౌదర్య, ఏఎన్ఎం ఎస్కే మున్నీషా, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆరుగురి అరెస్టు

సీతానగరం: అచ్చయ్యపాలెంలో కోడిపందేలాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ వీఎస్ శివకృష్ణ బుధవారం తెలిపారు. చీపురపల్లి పంచాయతీ అచ్చయ్యపాలెంలో కోడి పందాలు ఆడుతుండగా దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,260, రెండు పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పరీక్షకు 18 మంది గైర్హాజరు

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో రోజు ఇంగ్లిష్ పరీక్షకు మూడు కేంద్రాల్లోను కలిపి మొత్తంగా 604 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 586 మంది మాత్రమే హాజరయ్యారని, మరో 18 మంది గైర్హాజరయ్యారన్నారు. రాష్ట్ర పరిశీలకులు డి.మధుసూదనరావు సింగంపల్లి, రంగంపేట పరీక్షా కేంద్రాలను పరిశీలించారని తెలిపారు.

డ్రైనేజీలో పూడికతీత పనులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన క్యాంపులో భాగంగా బుధవారం నాగరత్నం కాలనీలో డ్రైనేజీ పూడిక తీత పనులు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎమ్ సుధామయి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, ఏఎస్ఎం అరుణ, అధ్యాపకులు డీవీవీ నాగేశ్వరరావు, వి.సుబ్బారావు, వెంకటేష్, సురేష్, రాజశేఖర్, అలేఖ్య, వాణి, మనోహరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

రంగంపేట: మండలంలోని సింగంపల్లి గ్రామంలో చంద్ర పుల్లారెడ్డినగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన సోడసాని రమాదేవి కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందించి మాట్లాడారు. ప్రమాదం జరిగి నాలుగు రోజులైనా అధికారులెవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, సహాయ కార్యదర్శి కడితి సతీష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, డి.సురేష్, వి.సత్తిబాబు, చక్కా సత్తిబాబు, కన్నబాబు పాల్గొన్నారు.

పిచ్చుకల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఏపీ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ క్రిష్ణప్రియ
- ఫారెస్టు అకాడమీలో పిచ్చుకల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ క్రిష్ణప్రియ

రాజానగరం: పిచ్చుకలు మానవాళి జీవన విధానానికి ఎంతగానో మేలు చేకూరుస్తాయని, వాటిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఏపీ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ జి.క్రిష్ణప్రియ అన్నారు. లాలాచెరువులోని ఏపీ ఫారెస్టు అకాడమీలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రిష్ణప్రియ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఆవాసాల సంఖ్య తగ్గిపోవడం, కాలుష్యం పెరిగిపోయి, పర్యావరణ విధ్వంసం వంటి అనేక రకాల కారణాలు పిచ్చుకల పై ప్రభావాన్ని చూపుతూ, వాటి సంఖ్య తగ్గిపోవడానికి కారణమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పిచ్చుకల సంరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో అకాడమీ యంత్రాంగం చేపట్టిన వివిధ అవగాహన కార్యక్రమాలలో శిక్షణలో ఉన్న ఫారెస్టు బీట్ ఆఫీసర్స్, రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో తూర్పు కనుమల వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో పాముల పై అపోహలను తొలగిస్తూ అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పర్యావరణలో పాముల ప్రాముఖ్యత పై సొసైటీ ప్రతినిధి మూర్తి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

నయనానందం.. నరసన్న కల్యాణం

- వైభవంగా రథోత్సవం
- స్వామివారిని దర్శించుకున్న భక్తులు



స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేవారు. తొలుత ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించి అనంతరం మధ్యాహ్నం 1.58 గంటలకు అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణతో రథం బయలుదేరింది. కొండ దగ్గర నుంచి ప్రారంభమైన రథం దేవస్థానం రోడ్డు, సుజలా ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, రెడ్డి పంతులు సత్రం, శివాలయం మీదుగా సాగింది. ఈసందర్భంగా గరగ నృత్యం, బ్యాండ్ మేళం, కోలాటం, తీన్‌మార్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా జరిగింది. రాత్రి 9 గంటలకు వేదపండితులు నరసింహస్వామి, లక్ష్మీదేవిల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణాన్ని భక్తులు తిలకించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్, డీసీ రమేష్‌బాబు, ట్రస్టీ తాడి రజనీ, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, బొండాడ చందు, కటకం బాబ్జి, బొరుసు బద్రి, వాకా నరసింహరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, ఎస్సై ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందరి మన్ననలు అందుకోవడం కొందరికే సాధ్యం



కుమార్ మాస్టార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాజానగరం: ఉద్యోగి అయిన ప్రతి ఒక్కరికి పదవీ విరమణ తప్పదని, అయితే కుమార్ మాస్టారు మాదిరిగా అందరి మన్ననలు అందుకుంటూ విరమణ పొందడం కొందరికే సాధ్యమని రిటైర్డ్ ఎంఈఓ లాజపతి రాయ్ అన్నారు. కోరుకొండలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఎంవీవీఎస్ ప్రభాకరకుమార్‌ని సుదీర్ఘ కాలం పని చేసిన మండలంలోని శ్రీరామపురంలో ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, ఎస్టీయూ ప్రతినిధులు, బంధువులు, మిత్రులు కూడా కుమార్ మాస్టార్ దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి, అభిమానాన్ని చాటుకున్నారు.

మోరంపూడి జంక్షన్‌లో ట్రాఫిక్ డైవర్షన్



నిర్మాణ పనులు జరుగుతున్న మోరంపూడి ఫ్లైఓవర్

- ముమ్మరంగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు
- 15 రోజుల పాటు ట్రాఫిక్ డైవర్షన్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీని కోసం రాజమహేంద్రవరం నగర, పరిసరప్రాంత ప్రజలకు ట్రాఫిక్ డైవర్షన్ అమలు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఓ ప్రకటనలో తెలిపారు. మోరంపూడి జంక్షన్ నుంచి నామవరం వెళ్లేరోడ్డులో ముఖ్యమైన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు 15 రోజుల పాటు జరగనున్నాయని, అటుగా రాకపోకలు సాగించే వాహనాలకు కొన్ని ట్రాఫిక్ డైవర్షన్ ఆంక్షలు విధించామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్లో ప్రయాణించకూడదని, డివైడర్ల సందుల్లోంచి నుంచి రోడ్డు దాటడం ప్రమాదకరమని, తప్పనిసరిగా అందరూ ట్రాఫిక్ నియమాలు పాటించి తమ గమ్య స్థానాలను సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్‌ని రాజమహేంద్రవరం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు గమనించి, సహకరించాలని ఎస్పీ కోరారు.



మోరంపూడి ఎఫ్ఓబీ గడ్డర్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఎఫ్ఓబీ పనులను పరిశీలించిన ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరంలోని మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో అత్యంత ప్రధాన ఘట్టం కుడి, ఎడమల వంతెనలను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసే గడ్డర్లను బుధవారం రాత్రి అమర్చారు. భారీ వాహనాలపై గడ్డర్లను బ్రిడ్జి నిర్మాణ స్థలానికి తీసుకొచ్చి క్రేన్ల సహాయంతో వాటిని అమర్చారు. ఈ పనులను ఎంపీ భరత్‌రామ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. విశాఖ, విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు.

డైవర్షన్ ఇలా...

- నామవరం నుంచి మోరంపూడి సెంటర్ మీదుగా రాజమహేంద్రవరం టౌన్ లోనికి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కారులు సాయినగర్ దుర్గమ్మ టెంపుల్ వద్ద కుడి పక్కకు తిరిగి గాదాలమ్మ రోడ్డు మీదుగా అప్సర హోటల్ వద్ద నేషనల్ హైవేకి వెళ్లాలి.
- సాయినగర్ దుర్గమ్మ టెంపుల్‌కి ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా, గంగిరెడ్ల కాలనీ మీదుగా హుకుంపేట సెంటరుకు వెళ్లాలి
- నామవరం నుంచి వచ్చే భారీ వాహనాలు సాయినగర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రోడ్డులో గాదాలమ్మ రోడ్డు మీదుగా నేషనల్ హైవే కి వెళ్లాలి.
- ఆర్టీసీ బస్సు స్టాండ్ నుంచి నామవరం వెళ్లాల్సి వాహనాలు వీఎల్ పురం వినాయకుడి గుడి మీదుగా రైతు బజార్ సెంటర్, కవలగొయ్యి సెంటర్, నేషనల్ హైవే మీదుగా, నిమ్మకాయల మార్కెట్ రోడ్డు (గాదాలమ్మ గుడి రోడ్) మీదుగా నామవరం వెళ్లాలి.

ముఖ్య గమనిక: నేషనల్ హైవే మీద విశాఖపట్నం నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు ప్రయాణించే వాహనాలకు ఎటువంటి ఆంక్షలు లేవు.

కాలినడక యాత్ర చేస్తున్న వారికి సంఘీభావం

కాలినడక యాత్ర చేస్తున్న వారికి సంఘీభావం



పాదయాత్రికులకు సంఘీభావం తెలుపుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని, జక్కంపూడి రాజా గెలుపొందాలని కోరుతూ స్థానిక పార్టీ కార్యాలయం నుంచి కాలినడకన గౌరీపట్నం వెళుతున్న ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సంఘీభావం తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరం తొర్రేడు శివారున పాదయాత్ర చేస్తున్న వారికి స్వాగతం పలికి మద్దతునిచ్చారు. అంబటి రాజు, అంబటి రమణ, మాకిరెడ్డి సాయి కల్యాణ్, కొల్లి చిరంజీవి, మరాల సతీష్, సుభాష్, ఈతకొట్టు వెంకట్, అంబటి కళ్యాణ్, గుర్రాల కృష్ణారావు, రేలంగి రమేష్, మాగాపు రాజు తదితరులు సీతానగరం నుంచి గౌరీపట్నం పుణ్యక్షేత్రం వరకూ కాలినడక వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.